క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పెద్ద రామాలయం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అర్ధ రాత్రి నుంచి 16,17 వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ తీగలు షార్టుసర్క్యూట్ అయి మంటలు చెలరేగినట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు. ఏఈ శ్రీనివాస్ పర్యవేక్షణలో పనులు ప్రారంభించి విద్యుత్ పునరుద్ధరించారు. పెద్ద ఎత్తున మంటలు రావడంతో స్థానిక ప్రజలు భయపడి వీధుల్లోకి వచ్చారు.

విద్యార్థినులకు మెటీరియల్ పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బాలికోన్నత జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు పట్టణానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ నీటి శెట్టి సత్యనారాయణ రూ.15 వేలు విలువచేసే మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను నేటి తరం విద్యార్థినులు కొనసాగించాలని తెలిపారు. ప్రణాళికతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె. హేమమాధవి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన...



ముండ్లపాడు(పెనగంచిప్రోలు):స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు శక్తి యాప్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్‌కు సంబంధించి ఏఎస్‌ఐ హనుమ నాయక్ మాట్లాడుతూ విద్యార్థినులపై సమాజంలో జరుగుతున్న దాడులు, వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. శక్తి యాప్ ఎలా ఉపయోగించాలి, ఎలా ఉపయోగ పడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్రామాయణ పురాణ ప్రవచనం



నందిగామ రూరల్:ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని శతవార్షిక ముక్కోటి మహా మండపంలో మల్లాది వెంకట రామనాథ శర్మచే గడిచిన తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ పురాణ ప్రవచనం పారాయణ కార్యక్రమం సోమవారం ముగిసింది. సీతారామచంద్ర లక్ష్మణ ఆంజనేయ స్వామి వారికి సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలతో తిరువంజనం, విశేష అర్చనలు, సీతారామచంద్ర స్వామి వారి శాంతి కల్యాణం, పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముక్కోటి మహా మండప కమిటీ సభ్యులు దివి రత్నమాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై డ్రోన్ పంపిణీ



నందిగామ రూరల్:రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన రైతు మల్నీడి శ్యాంప్రసాద్‌కు 80 శాతం రాయితీపై అందజేసిన రూ. 10 లక్షల విలువ చేసే డ్రోన్ యంత్రాన్ని సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసరావు, ఏవో గింజుపల్లి నాగేశ్వరరావు, నాయకులు ఉప్పుకొండూరు గురుప్రసాద్, తోట నాగమల్లేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమస్యల లోగిళ్లు.. సంక్షేమ వసతి గృహాలు..

- మూడేళ్లుగా అడ్మిషన్లు లేని పెనుగంచిప్రోలు బాలుర వసతి గృహం
- ఊరికి దూరంగా కొణకంచి బాలికల వసతి గృహం



మరమ్మతులు నిర్వహించిన పెనుగంచిప్రోలు బాలుర వసతి గృహం



అద్దె భవనంలో పెనుగంచిప్రోలు బాలుర వసతి గృహం

పెనుగంచిప్రోలు:మండలంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు అనేక సమస్యలతో కునారిల్లుతున్నాయి. దీంతో విద్యార్థులు ఎవరూ వీటిలో చేరేందేకు ఇష్టపడటం లేదు. మండల కేంద్రం పెనుగంచిప్రోలులో ఎస్సీ (బాలుర) వసతి గృహం ఉంది. కొణకంచి గ్రామంలో ఎస్సీ (బాలికల) వసతి గృహం ఉంది. గతంలో పెనుగంచిప్రోలు వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య బాగానే ఉంది. 70 నుంచి 100 మంది వరకు వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉండేవారు. 3 నుంచి 8 తరగతుల విద్యార్థులను ఇక్కడ చేర్చుకునేవారు. రానురాను వసతి గృహంలో సమస్యలు పెరగటంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. గత ఏడాది నుంచి అడ్మిషన్లు కూడా లేని పరిస్థితి ఉంది. కానీ వార్డెన్‌తో పాటు సిబ్బంది మాత్రం ఉన్నారు.

మరమ్మతులు చేసినా...

వసతి గృహం భవనం 12 గదులు శ్లాబ్‌లు ఊడిపోతూ శిథిలమయ్యాయి. దీంతో పాటు టాయిలెట్స్, రన్నింగ్ వాటర్ సదుపాయం, ఎలక్ట్రిఫికేషన్ లేక గత మూడేళ్లుగా సిబ్బంది ఉన్నా విద్యార్థులు లేక వసతి గృహం ఖాళీగా ఉంది. అయితే ఈ ఏడాది సుమారు రూ.11 లక్షలతో వంటశాలకు మరమ్మతులు, టాయిలెట్స్, ఎలక్ట్రిఫికేషన్ ఏర్పాటు చేసి వంటశాలను విద్యార్థులు ఉండేందుకు అనుకూలంగా మార్చారు. విద్యార్థుల అడ్మిషన్లు కోసం ప్రచారం కూడా నిర్వహించారు. అయితే విద్యార్థులు అందరూ గురుకులాల వైపు వెళ్లటంతో ఈఏడాది కూడా విద్యార్థులు ఎవరూ చేరలేదు. గ్రామంలో ఉన్న బీసీ వసతి గృహంలో 50 మంది వరకు విద్యార్థులు ఉన్నా అద్దె ఇంట్లో అది పలు సమస్యలతో కునారిల్లుతోంది. కనీసం వసతి గృహం బోర్డు కూడా కరువైంది. చాలీచాలని గదులు, టాయిలెట్స్‌తో పాలు పలు సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. అలాగే వార్డెన్ తిరువూరు నుంచి రావాల్సి ఉందని దీంతో సక్రమ నిర్వహణ ఉండటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఖాళీగా ఉన్న ఎస్సీ వసతి గృహానికి బీసీ వసతి గృహం విద్యార్థులను పంపితే ఉపయోగంగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు.



గ్రామానికి దూరంగా ఉన్న కొణకంచి బాలికల వసతి గృహం

గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో వసతి గృహం...

కొణకంచి జగనన్న కాలనీలో ఉన్న బాలిక వసతి గృహం నుంచి గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు 2 కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో విద్యార్థులు అక్కడి నుంచి నడిచి పాఠశాలకు వెళ్లలేక వసతి గృహంలో చేరేందుకు సుముఖత చూపటం లేదు. 3 నుంచి 8 తరగతులకు ప్రస్తుతం 12 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ భవనం, ఇతర నిర్మాణాలు బాగానే ఉన్నా దూరం కావటంతో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది.

ప్రచారం నిర్వహిస్తున్నాం

పెనుగంచిప్రోలు ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల కోసం ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నాం. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కొణకంచి హాస్టల్ నుంచి గ్రామంలో స్కూల్ వరకు విద్యార్థులను ఉదయం తీసుకెళ్లటం, సాయంత్రం తీసుకువచ్చేందుకు ఆటో ఏర్పాటు చేశాం.

–ఆంజనేయస్వామి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, పెనుగంచిప్రోలు

బీసీలపై చంద్రబాబుది కపటప్రేమ

జగ్గయ్యపేట అర్బన్:చంద్రబాబునాయుడుకు బీసీలపై ఉన్నది కపటప్రేమ అని మరొకమారు రుజువు అయిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్, బీసీ మహిళలైనటువంటి ఉప్పాల హారిక మీద దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ మూకలు కారుపై పడి భయభ్రాంతులకు గురిచేస్తూ అసభ్య పదజాలంతో దూషించడం దారుణమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలో బీసీలను బ్యాక్‌బోన్‌గా చూస్తే నేడు కూటమి ప్రభుత్వం దాడులు చేస్తూ బీసీల మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు. సరైన సమయంలో కూటమి పాలనకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

వేలం పాట వాయిదా

నందిగామ రూరల్:మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించాల్సిన సీల్డు టెండర్ కం బహిరంగ వేలం పాటలు వాయిదా పడినట్లు ఇన్‌చార్జ్ ఈవో పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కుకు, లడ్డూ ప్రసాదం, బ్రహ్మోత్సవాలు, పండుగలకు సరుకుల సరఫరా చేసే హక్కులకు వేలం పాటలు నిర్వహించగా పాటదారులు ఆసక్తి చూపకపోవటంతో వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 20 అర్జీలు



అర్జీ తీసుకుంటున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ రూరల్:ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 20 అర్జీలు అందాయన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తొమ్మిది, సర్వే మూడు, మున్సిపాలిటీ రెండు, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖకు సంబంధించి రెండు అర్జీలు అందాయని తెలిపారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపటంతో పాటు ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్నంగా మున్సిపల్ కార్మికుల నిరసన



నందిగామ పట్టణంలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నందిగామ రూరల్:మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె రెండో రోజుకు చేరింది. దీనిలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టటం లేదన్నారు. ముఖ్యంగా న్యాయమైన కోర్కెలు, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా కనీసం పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో కార్మికులు కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, దారెల్లి అశోక్, దాసు, బ్రహ్మం, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలి

వీరులపాడు:ఖరీఫ్–2025లో మిర్చి, మొక్కజొన్న, పెసర, పత్తి పంటలు సాగు చేయటంతో పాటు పంటల ప్రీమియం చెల్లించిన రైతులకు మాత్రమే పంటల బీమా పథకం వర్తిస్తుందని వ్యవసాయాధికారి జోగేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పత్తికి ఎకరాకు రూ. 1900, మిర్చి ఎకరాకు రూ. 1800, మొక్కజొన్నకు ఎకరాకు రూ. 370, పెసర ఎకరాకు రూ. 360, వరి పంటకు ఎకరాకు రూ. 850 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పత్తికి మంగళవారం లోగా ప్రీమియం చెల్లించాల్సి తెలిపారు. రైతులు విధిగా పంటల ప్రీమియం చెల్లించి పథకాలను పొందాలని సూచించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలి

కంచికచర్ల: పెరిగిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని నందిగామ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందా వజ్రయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పీటర్ జోసెఫ్ డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రజలు నమ్మి కూటమి పార్టీలకు ఓట్లేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలోకి తొక్కిందన్నారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలగిస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ తరుపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

నందిగామ టౌన్:విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమవగా ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పట్టణ పరిధిలోని అనాసాగరానికి చెందిన చాపల మల్లికార్జునరావు నివాసంలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ క్రమంలో ఇంట్లోని విద్యుత్ బల్బు పగిలి నిప్పురవ్వలు సోఫాలో పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖాధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోగా మల్లికార్జునరావు, ఆయన భార్య నవదుర్గలకు గాయాలయ్యాయి. సుమారు రూ. ఐదు లక్షల విలువ చేసే వస్తువులు కాలిపోయాయని బాధితుడి కుమారుడు నరసింహారావు తెలిపారు.

హారికపై దాడికి నిరసన



కంచికచర్లలో హారికపై జరిగిన దాడిపై నిరసన తెలియజేస్తున్న బీసీ సంఘ నాయకులు, మహిళలు

కంచికచర్ల: వైఎస్సార్ సీపీ మహిళా నేత, ఉమ్మడి కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ బీసీ మహిళా నాయకురాలు ఉప్పాల హారిక, ఆమె భర్త రాముపై పక్కా ప్రణాళిక ప్రకారమే పచ్చ సైకోలు హత్యాయత్నానికి పాల్పడటం అత్యంత హేయమైన చర్యని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మార్త రజినీ, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి మండిపడ్డారు. టీడీపీ గూండాల దాడికి నిరసనగా కంచికచర్లలో బీసీ మహిళలు, బీసీ సంఘ నాయకులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ గుడివాడలో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఉప్పాల హారిక తన భర్త రాముతో కలసి కారులో వెళ్లుతుండగా టీడీపీ గూండాలు కారును అడ్డగించి రాళ్లు రువ్వి వారిని హతమార్చేందుకు కుట్రపన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుందా లేక మరేదైనా నడుస్తుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హారిక ఆమె భర్త రాముపై హత్యాయత్నానికి పాల్పడిన పచ్చ గూండాలను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ప్రసాద్, ప్రభాకర్, పోతరాజు జార్జి విక్టర్ తదితరులు

కంచికచర్ల: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువుకునేందుకు అరుంధతీయ విద్యార్థి సేవా సమితి ఎంతో తోడ్పాటు అందజేస్తుందని సంఘ అధ్యక్షుడు నకిరికంటి ప్రసాద్ అన్నారు. కంచికచర్ల అరుంధతీనగర్‌లో పేద కుటుంబానికి చెందిన బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న జల్లి రాకేష్‌కు సమితి ఆధ్వర్యంలో సోమవారం రూ.65వేల విలువైన ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఈ మేరకు సంఘ గౌరవాధ్యక్షుడు ముండ్లపాటి పోతరాజు మాట్లాడుతూ తమ సేవా సమితి ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు తమ వంతుగా సహాయ సహకారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబాలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు అందజేసామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వేల్పుల ప్రభాకర్, మాదుగుల వాసు, నక్కా అంబేద్కర్, మార్కపూడి జార్జి విక్టర్, నంద్రు శ్రీనివాసరావు, ఐలపోగు నాగేశ్వరరావు, నెమలి వాసు తదితరులు పాల్గొన్నారు.

మట్టిని బొక్కేస్తున్న కూటమి నేతలు!

- కంచికచర్ల, పరిటాల, గండేపల్లి చెరువుల్లో అక్రమంగా మట్టి తరలింపు
- నందిగామలోని వెంచర్లకు తరలిపోతున్న గండేపల్లి చెరువుమట్టి
- భారీ పొక్లెయిన్‌లతో మట్టి తవ్వకాలు
- పేట్రేగిపోతున్న మట్టి మాఫియా



కంచికచర్ల చెరువులో మట్టిని లారీలకు లోడింగ్ చేస్తున్న పెద్ద పొక్లెయిన్



పరిటాల చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా తరలిపోతున్న చెరువు మట్టి

కంచికచర్ల:నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని కృష్ణా, మునేటి పరివాహక గ్రామాల్లో ఒక పక్క ఇసుక మాఫియా రెచ్చిపోతుంటే, మరో పక్క పచ్చని పల్లెల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతుంది. అధికారుల అలసత్వాన్ని ఆసరా చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఇసుక మాఫియాకు ఇప్పుడు మట్టి మాఫియా కూడా తోడవటంతో ప్రకృతి సంపద హారతి కర్పూరంలా కరిగిపోతుంది. ముఖ్యంగా కంచికచర్ల మండలంలోని పరిటాల, గండేపల్లి, కంచికచర్ల గ్రామాల పరిధిలోని చెరువు నుంచి కూటమి నేతలు, అక్రమార్కులు ఇష్టారీతిన మట్టి తోలకాలు సాగిస్తున్నారు.

రూ.లక్షలు కొల్లగొడుతున్న తెలుగు తమ్ముళ్లు..

మట్టిని విక్రయిస్తూ అక్రమార్జనతో తెలుగు తమ్ముళ్లు రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. కంచికచర్ల, పరిటాల, గండేపల్లి గ్రామాల్లో చెరువులో పొక్లెయిన్ యంత్రాలను ఉపయోగించి రోజుకు వందల సంఖ్యలో పెద్ద పెద్ద లారీలతో మట్టిని తవ్వుతున్నారు. మండలంలోని గండేపల్లి సుబ్బరాజు చెరువు నుంచి నందిగామలో అక్రమార్కులు వేసిన వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. చెరువులో మట్టిని లోడ్ చేసేందుకు ట్రక్కు మట్టిని రూ. 800 నుంచి 1,500 నుంచి వరకు విక్రయిస్తూ అక్రమార్కులు లక్షలు గడిస్తున్నారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు.....

ఎటువంటి అనుమతులు లేకుండా కంచికచర్ల, పరిటాల, గండేపల్లి చెరువుల్లో భారీ గోతులు పెట్టి మట్టిని తరలిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో నీటిని తాగేందుకు చెరువుల్లోకి దిగిన పశువులు, మూగజీవాలు సైతం భారీ గోతుల్లో పడి మృత్యువాత పడుతున్నాయని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే నిత్యం వందల సంఖ్యలో వాహనాల్లో మట్టి తోలుతున్నా పట్టించుకొనే అధికారులు కనుచూపుమేరలో కనిపించటం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయటంతో పాటు మట్టి రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంచికచర్లలోని ఓ వెంచర్‌కు తరలించిన కంచలమ్మ చెరువు మట్టి

వెంచర్లకు వెళుతున్న మట్టి.....

టీడీపీ నాయకులు కంచికచర్ల కంచిలమ్మ చెరువు నుంచి అక్రమంగా వెంచర్లకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు పంట పొలాలను మెరక చేసుకునేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. అదీ కూడా ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించేందుకు మాత్రమే వెసులుబాటు కల్పించారు. కాని కూటమి నేతలు అవేమీ పట్టించుకోకుండా వెంచర్లకు అడ్డగోలుగా మట్టిని తరలిస్తున్నారు. రైతులు ఇప్పటికే తమ పొలాల్లో పలు రకాల పంటలు సాగుచేశారు. అయినా మట్టిని తరలించేందుకు అధికారులు ఏ విధంగా చెరువుల్లో మట్టిని తరలించిందేందుకు అనుమతులు ఇచ్చారని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గండేపల్లి సుబ్బరాజు చెరువు నుంచి నందిగామలోని వెంచర్లకు అక్రమంగా పెద్ద పెద్ద లారీలతో మట్టిని తరలించి లక్షలు గడిస్తున్నారు, కాని కేవలం గ్రామంలోని రైతుల పొలాల్లోకి తోలుకునేందుకు మాత్రమే అధికారులు అనుమతులు ఇచ్చారు. అదేవిధంగా కంచికచర్ల కంచిలమ్మ చెరువు నుంచి సర్వేనెంబర్127–ఏ3,193–1బి, 662–1, 201–1, 21–బి,226–1,166–2,265–2ఏ, 620–2ఏ,180 సర్వేనెంబర్లకు మాత్రమే ఇరిగేషన్ శాఖ అధికారులు మట్టిని తరలించేందుకు అనుమతులు ఇచ్చారు. కాని పైన పేర్కొన్న సర్వేనెంబర్లన్నీ ఇప్పటికే రైతులు పలు రకాల పంటలు సాగుచేశారు. అయినా చెరువుల్లో మట్టి తవ్వకాలు యధేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి.

పొలాలకు మాత్రమే మట్టిని తరలించాలి

కంచికచర్ల, పరిటాల, గండేపల్లి గ్రామాల్లోని మట్టి తవ్వకాలు రైతులు ఇచ్చిన సర్వే నెంబర్లలోని పొలాలకు మాత్రమే చెరువు మట్టిని తవ్వుకోవాలి. వెంచర్లకు మట్టిని తరలించేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. నాకు నాలుగు మండలాల బాధ్యతలు అప్పగించటంతో మట్టి మాఫియాను నియంత్రించలేకపోతున్నా. అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టిని తవ్వితే చర్యలు తీసుకుంటాం.

–రాజేష్, ఇరిగేషన్ ఏఈ, కంచికచర్ల

బ్రిక్స్ కంపెనీ వద్ద రైతుల నిరసన



కవులూరులో బ్రిక్స్ కంపెనీ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కవులూరు(జికొండూరు): స్థానికంగా ఉన్న లైట్ వెయిట్ బ్రిక్స్ కంపెనీ యాజమాన్యం తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ వాహనాలతో రోడ్లు గుల్లవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కంపెనీ యాజమాన్యం రైతులపై దురుసుగా వ్యవహరించడం వలన సోమవారం ఎస్సీఎల్ బిల్డ్ టెక్ కంపెనీ మెయిన్ గేటుకు తాళం వేసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుకు రెండు వైపులా భారీసైజు వాహనాలు నిలుపుదల చేయడంతో పాటు ఓవర్ లోడుతో కంపెనీ లారీలు నడవడం వల్ల రోడ్డు ఛిద్రమవుతోందని రైతులు ఆరోపించారు. గుల్లబారిన రోడ్లపై ప్రజలు రాకపోకలు చేయడం ఇబ్బందిగా మారిందని రైతులు తెలిపారు. అధికారులు జోక్యం చేసుకుని కంపెనీ యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు గ్రామస్తులతో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.